24

## విరుదులున్నాయి జాగ్రత్త!

మనిషికి ఓ ప్రభుత్వ సంస్థ నుండి ఉత్తరమొచ్చింది.

"ప్రభుత్వం వారు ఈ యేటి ఉత్తమ వ్యక్తిని ఎంపిక చేయ దలుచుకున్నారు. మీకు మీరు ఉత్తమ వ్యక్తియే అని భావించుచున్న యెడల అన్ని వివరములతో దరఖాస్తు పంపుకోవలసిందిగా కోరడ మైనది"- అన్నది ఉత్తరంలోని సారాంశం.

మనిషికి ఏమాత్రం అనుమానం రాలేదు. అసలు తనకన్న ఉత్తమోత్తముడు ఎవరుంటారు ప్రపంచంలో? కావాలని చీమకైనా హానిచేసి ఎరగడే. కోళ్లూ, గొర్రెలు ఎవరో కోసి పెడితే తినడం వేరు- భార్యను పువ్వుల్లో పెట్టి చూసుకోలేదుగానీ, పెళ్ళయిన కొత్తలో పువ్వులు తెచ్చేవాడు కదా? మిత్రులకు సహాయ సహకారాలు అందిం చాడా? ఓ అందించాడు. అసలు కీడు తలపెట్టక పోవడమే ఈ రోజుల్లో గొప్ప సహాయం కదండీ- అబద్ధాలాడడం, ధూమపానం, మందు వగైరా ఏవైనా అలవాట్లున్నాయా? అస్సలు!! రామ రామా....! అయితే మిత్రుల సరదా కోసం ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధం!! అది తన వ్యక్తిత్వాన్ని ఎలా దెబ్బ తీస్తుంది? వివాహేతర లైంగిక సంబం ధాల గురించేమిటి? అబ్బే ఏం లేవు. లేవనే చెప్పాలి. అప్పుడెప్పుడో బి.ఏ. పాసైన తొలి రోజుల్లో క్లోజ్ ఫ్రెండ్ సిస్టర్‌కి ఇంగ్లీషు పాఠం చెప్పాల్సి వచ్చింది. బెర్నాడ్ షా నాటకం ఆర్మ్స్ అండ్ ద మ్యాన్‌లో హీరో హీరోయిన్ ఇలాగే వుంటారు కదా! కదా!! కదా!!! అని ఆ

అమ్మాయే అమాయకంగా పైపైన పడింది. అంతే తనకుతానై ఉద్గ్రంథం నడపలేదు కదా!

రష్యాలో ఏడాది పాటు మార్క్సిజం చదువుకొస్తానన్న దగ్గరి బంధువు ఒకతను భార్యను తనింట్లో వదిలి వెళితే తను అభ్యంతరం చెప్పాడా? ఉహూఁ- లేదే- ఎంతో ఉదార స్వభావంతో, విశాల హృదయంతో ఆహ్వానించాడు. ఎన్నో ఏంగిల్స్‌లో ఆలోచించి అపర ఏంగిల్స్‌లా ప్రోత్సహించి పంపాడు కదా! ఆ చుట్టాలమ్మాయి వరసకి తమ్ముడి భార్య 'బావా బావా' అని తిరుగుతూ వుంటే, తన భార్య ఓర్వ గలిగిందా? భగ్గున మండింది. నిజంగానే నీతో సంసారం చేయలేనని చెప్పి, స్టౌకు చీరె అంటించుకుని చచ్చింది.

ఒంటరి వాణ్ణయి పొయ్యానని కదూ ఆ చుట్టాలమ్మాయి జీవితం పంచిచ్చింది? తను ఎవరి దగ్గరా ఏమీ ఆశించలేదు. ఎవరి ఇల్లూ కూల్చలేదు. ఎవరి ఇంటికీ అగ్గి పెట్టలేదు. సహజ సిద్ధంగా అన్నీ అలా జరిగి పొయ్యాయి. తను నిమిత్త మాత్రుడు. తిరిగి పోయిన కాలచక్రంలో ఉత్తమ "ఉత్తమ వ్యక్తి"గా నలిగిన తనది నిష్కామ కర్మ.

ఇక వ్యాపార విషయం. వ్యాపార మంటేనే లెక్కలు! కొంచెం అటూ ఇటూ రాయక తప్పదు. ఆ మాత్రానికి తన పార్ట్‌నర్ వెధవ పిచ్చెక్కి ఊరి మీద పడాలా? తప్పువానిది. తన లాభం గురించి తను చూసుకున్నాడే గాని, వాణ్ణి పిచ్చోణ్ణి చెయ్యాలని ఆలోచించలేదు కదా! కాలనీలో చందాలు వసూలు చేశాడు నిజమే, కాని- వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయించాడు కదా! అంతకన్నా ప్రజాసేవ ఏముంటుంది? కట్టిస్తానన్న గుడి కట్టించలేక పొయ్యాడు గానీ, చింత చెట్టు కింద ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన చేయించాడు కదా?

మనిషి చాలా రోజులు, చాలా రకాలుగా తన గురించి తాను ఆలోచించుకున్నాడు- ఎక్కడా తన వ్యక్తిత్వంలో తప్పు దొరకలేదు.

టోటల్లీ- క్లీన్: ప్రభుత్వం వారి 'ఉత్తమ వ్యక్తి' అవార్డు తనకు రాక తప్పదని అనుకున్నాడు.

తన వివరాలు పంపుదామని నిశ్చయించుకున్నాడు.

ఈ మధ్య కాలంలో ప్రభుత్వం మారింది- సీరియస్‌గా ఆలోచించే వారు దిగిపోయ్యారు. జోకర్లూ, బ్రోకర్లూ రాజ్యాని కొచ్చారు. అనేకానేక ప్రభుత్వ విధానాలతో పాటు, "ఉత్తమ వ్యక్తి" అవార్డు విషయంలో కూడా మార్పులు వచ్చాయి.

ప్రభుత్వం వారి నుండి మనిషికి మరో ఉత్తరంవచ్చి చేరింది. సారాంశం ఇలా ఉంది.

"ఈ దేశంలో ఉత్తమ వ్యక్తులే కాదు. పరమోత్తమ మహా వ్యక్తులున్నారు. వారికి కొదువ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో "ఉత్తమ నీచుడు" దొరకడం కష్టం. నీచులుంటేనే ఉత్తమ వ్యక్తుల విలువ తెలిసేది. అంటే ఉత్తమ వ్యక్తులు బయటపడడానికి నీచులే కారణం! అందుకని ఈ సంవత్సరం 'ఉత్తమ వ్యక్తి' అవార్డు రద్దుచేసి "ఉత్తమ నీచుడి" అవార్డును నెలకొల్పడం జరిగింది. ఈ అవార్డు కింద మూడు లక్షల నగదు. సంప్రదాయ సిద్ధమైన రాగి చెంబు, గొంగడి, ఖద్దరు రుమాలు బహూకరిస్తారు. దేశంలోని పేరెన్నిక గన్న ముఖ్యమైన మూడు మురికి వాడల్లో మూడు నెలల ఉచిత పర్యటన ఉంటుంది. డీలక్స్ పాసింజర్ రైలు టికెట్లు రెండు ఉచితంగా లభిస్తాయి. ఇంకా అప్పటి దాకా బతికి వున్న మొండి ఘటాలకు న్యా న్యా భ్యా భ్యా-దీవుల్లో నాటు పడవ విహారం అదనంగా ఉంటుంది."

వివరాలు చదువుకుని మనిషి ఎగిరి గంతేశాడు. ఆ ప్రకటన కేవలం తన కోసమే ఇచ్చినట్లుంది- అనుకున్నాడు. 'ఉన్న ఫళాన మూడు లక్షలు సామాన్యమా? పైగా గొప్ప గుర్తింపు లభిస్తుంది. దాని కెందుకు వదులు కోవాలి? "ఈ యేటి ఉత్త నీచుడి ఇంటర్వ్యూ" అని ప్రకటించడానికి అన్ని దిన, వార, మాస పత్రికలు, ఆకాశవాణి,

దూరదర్శన్, బిబిసి ఏసియన్ సర్వీస్‌లు 'క్యూ'లు కడతాయి. దేశ విదేశాల్లో గుర్తింపు సామాన్యమైంది కాదు'- అనుకున్నాడు మనిషి.

నిజమే తనలాంటి నీచుడు ప్రపంచంలో మరొకడు ఉండడు. కోళ్లూ, గొర్రెలే కాదు. అడవిలోని తేళ్లూ, నెమళ్లూ కూడా చంపించి తెప్పించుకున్నాడు. వన్యప్రాణి సంరక్షణ గురించి ఎన్ని చట్టాలుంటే ఏమిటి? అస్తుల సంపాదనలో మనిషి మాంసానికే అలవాటుపడ్డ ప్రాణం తనది. ఇతరులతో లాభం పొందడమే గానీ, జన్మలో ఎవడి కైనా వీసమెత్తు ఉపయోగపడ్డాడా? స్నేహితుడి చెల్లెలనీ లేదు. బంధువు భార్యఅనీ లేదు- పశువులాగా ప్రవర్తించాడు కదా! నీతి, రీతి ఏమైనా ఖాతరు చేశాడా? తన కసలు నిష్కృతి ఉందా? మహాసాధ్వి అయిన ఇల్లాలిని అగ్గికి ఆహుతి చేశాడు కదా? డబ్బు తప్ప మానవ సంబంధాల్ని పట్టించుకున్నాడా? తడి గుడ్డతో గొంతులుకోసే రకం అని ఎంత మందితో తిట్లూ, శాపనార్థాలు తినలేదూ? ఏ రకంగా చూసినా తనంతటి నీచుడు మరొకడు ఉండడు. జీవితంలో పైకి రావడానికి ఎంతగా దిగజారలేదూ? ఈ పార్టీ ఆ పార్టీ అని చూడకుండా ఎంత మంది రాజకీయ నాయకుల కాళ్ళ మీద పడలేదూ? సన్నాసుల్నీ! బాబాల్నీ ఆశ్రయించలేదూ? వ్యక్తిత్వమనేది లేకుండా, తను మనిషన్నది కూడా మరచి ప్రవర్తించిన సందర్భాలే ఎక్కువ కదా! జీవితంలో- జాతీయ ఉత్త నీచుడి అవార్డు తనకు కాక మరెవరికి వస్తుంది?

మనిషికి తన మీద తనకు గట్టి నమ్మక మేర్పడింది. "ప్రభుత్వాలు మారొచ్చు. పాలసీలు మారొచ్చు. ఉత్తమ వ్యక్తి అవార్డు ఉత్త నీచుడి అవార్డుగా మారొచ్చు. కానీ, అది దక్కేదైతే ఎప్పుడూ తనకే"- అని గర్వంగా పొంగి పొయ్యాడు మనిషి. తనకు తానే 'ధీరప్' అనుకున్నాడు. మర్డరు కేసుందని లిటిగేషన్‌లో పడ నీయకుండా మానవ వనరుల మంత్రిని పట్టాలి. ఈ పట్టే విద్యే

తనకు పుట్టుకతో అబ్బకపోతే ఎంత కష్టమయ్యేదో- అనుకున్నాడు మనిషి.

ఇంతలో మరో విచిత్రం జరిగింది- ప్రభుత్వం మారలేదు గానీ, కొన్ని కారణాలవల్ల, మంత్రులు మారారు. స్మగ్‌లింగ్‌లో ఓ మంత్రి దొరికాడు. మరో మంత్రి డాక్యుమెంట్లు విదేశాలకు అమ్మాడు. మరో మంత్రి పార్లమెంట్ భవన్‌ను అమ్ముతానన్నాడు. మరొకతను తాజ్‌మహల్ కాలుష్యంతో పాడై పోకముందే విదేశాలకు తరలిస్తే బావుంటుందన్నాడు.

నానా రభస జరిగింది.

టీ కప్పులో తుఫాను....తర్వాత, మంత్రుల పోర్ట్ ఫోలియోలు మారాయి. కామర్స్‌లో అనుభవం వున్న మంత్రి మంచినీళ్ళ మంత్రి అయ్యాడు. రవాణా శాఖలో అనుభవం ఉన్న మంత్రి దేవాదాయంలో కూరుకుపొయ్యాడు. అలా అలా "ఉత్తనీచుడి" అవార్డు ఫైలు చూడాల్సిన మంత్రి కూడా మారాడు. ఈ కొత్త మంత్రిగారు గొప్ప హాస్య ప్రియుడు- నీచుడి అవార్డు రద్దుచేసి "జాతీయ జోకర్ అవార్డు" నెలకొల్పాడు. పారితోషికం మరో లక్ష పెంచాడు. దేశ పరిస్థితిని తెలియజేసే విధంగా సంప్రదాయ రీతిలో చింకి బొంత, అల్యూమీనియం సత్తులోటా, ఆహూతులైన సభికుల సమక్షంలో నాలుగు చెప్పు దెబ్బలు కూడా అవార్డు గ్రహీతకు ఉంటాయని ప్రకటించ మన్నాడు.

ప్రకటన వెలువడింది.

ఆ మేరకు మనిషి మరోసారి ప్రభుత్వం వారి నుండి వివరాలు అందుకున్నాడు.

ఎలాగైనా "ఉత్తమ జోకర్" అవార్డు సాధించాలని మనిషి తపించి పొయ్యాడు. లేకపోతే నాలుగు లక్షల రొక్కం చేయిజారి పోతుంది. మంత్రులు, వారి ప్రభుత్వ విధానాలు పెద్ద పెద్ద జోకులే

అగుకాక- తనకేమిటి? ఏ ఎండకా గొడుగు పట్టి, సిగ్గులేకుండా అను కున్నది సాధించుకోవాలి. అదియే కదా ఉత్తమ మార్గంబు.

నిజమే! తనను మించిన జోకర్ గాడెవడుంటాడు? అసలు తను ఉత్తమ వ్యక్తి అవార్డుకు సిద్ధమయ్యాడు. దానికి పూర్తి విరుద్ధంగా "ఉత్త నీచుడు" కావాలన్నా తనే సిద్ధమయ్యాడు. ప్రభుత్వం వారు ఈ సూక్ష్మ విషయం గ్రహిస్తే చాలు! "ఉత్తమ జోకర్ అవార్డు" తనదే అవుతుంది. నమ్మకంగా, హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు మనిషి.

చాలా మంది మంత్రులకు మనిషి కుడిభుజంగా పనిచేసిన శ్రమ వృధా కాలేదు. కృషితో నాస్తి దుర్భిక్షం....

ప్రభువుల వారు మనిషికి ఏకంగా "మానవ రత్న" బిరుదునే ప్రదానం చేశారు.

-సమాజం స్పందించలేదు.

- ఉట్టి బిరుదు తప్ప, నగదు రొక్కం ఏదీ అందలేదు.

- మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకు తూనే ఉన్నాడు.

○

ఆగష్టు 1992